www.navatelangana.com
నవతెలంగాణ
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 26 మే 2023

గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలపై కేసు

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని సత్తెనపల్లి సేవానాయక్ తండాలో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సంపత్‌క్రిష్ణ తెలిపారు. ఈ తనిఖీల్లో సత్తెనపల్లి సేవానాయక్‌తండాకు చెందిన మహిళల నుండి ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్, సిబ్బంది నరేందర్, గౌతమ్, వెంకటేష్, ఇర్ఫాన్, కల్పన పాల్గొన్నారు. అనంతరం తండా ప్రజలకు సర్పంచ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గుడుంబా తాగితే కలిగే ఆరోగ్య సమస్యలు, కేసులను వివరించారు.

2న శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-నార్నూర్

వచ్చే నెల 2న తాడిహత్నూర్‌లో నూతనంగా నిర్మించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని సర్పంచ్ రాథోడ్ మధుకర్ కోరారు. గురువారం శివాజీ చౌక్‌లో గ్రామ పెద్దలు, యూత్ సభ్యులతో కలిసి విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వచ్చే నెల 2న శుక్రవారం జరిగే శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గిరి వికాసం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతుల సంక్షేమం, అభివృద్ధి కొరకు చేపట్టిన గిరి వికాసం పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. గురువారం అధికారులతో గిరి వికాసం పథకం అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో గిరి వికాసం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, జియో లాజికల్ సర్వే వెంటనే పూర్తిచేసి బోర్లు, వ్యవసాయ బావులు తవ్వించి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించి రైతులు సాగు చేసుకునే విధంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాకు 1593 యూనిట్లు మంజూరయ్యాయని, ఇద్దరు లేదా ముగ్గురు రైతులతో కూడిన యూనిట్‌కు రైతుల అంగీకారం తీసుకొని అవసరమైన డాక్యుమెంట్లు తయారు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించాలని తెలిపారు. ప్రతి బోర్‌వెల్, వ్యవసాయ బావికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కనెక్షన్ అందించాలని, విద్యుత్, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి రైతులు సాగునీటికి ఎలాంటి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ బావులకు మోటార్ల కొనుగోలుకు టెండర్ ప్రక్రియ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా ప్రతి ఆవాసానికి తాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, మరమ్మతులు అవసరమైన ప్రాంతాల్లో పనులు చేపట్టి పూర్తి చేసే విధంగా అధికారులు దృష్టి సారించాలని, తాగునీటి ఎద్దడి సమస్య లేకుండా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, మిషన్ భగీరథ ఈఈ వెంకటపతి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని బీఆర్‌ఎస్ ప్రభుత్వం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగ భృతి, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇలా అనేక హామీలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత ఆరోపించారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా 2వ రోజు మావల మండలంలోని బట్టిసావర్గాంలో గురువారం పార్టీ నాయకులతో కలిసి ఆమె పర్యటించారు. గ్రామంలో గడపగడపకు తిరుగుతూ వరంగల్ రైతు డిక్లరేషన్, సరూర్‌నగర్ యూత్ డిక్లరేషన్ గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు 4వేల నిరుద్యోగ భృతి, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్లను అందిస్తామన్నారు. బట్టిసావర్గాం చుట్టూ ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వకుండా అధికారపక్షం నాయకులే కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రకృతి సహకరించక పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, మావల మండలం కాంగ్రెస్ అధ్యక్షులు మిట్టిపెల్లి శేఖర్, కిసాన్ సెల్ అధ్యక్షుడు రాములు, రాజు, లోపీటి రాములు, రత్నాల రాజన్న, మిట్టిపెల్లి రాములు, దశరథ్, దర్శనాల ఆశోక్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శాంతన్‌రావు, ఉప సర్పంచ్ మల్లయ్య, వెంకట్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, కన్య ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఓ ప్రయివేట్ హాల్లో జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోడీ పాలనలో దేశం కీర్తి ప్రతిష్టలు ఉన్నత శిఖరాలకు చేరాయన్నారు. ఎన్నడూ లేని విధంగా దేశం వివిధ రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. అధిష్టానం ఆదేశాల మేరకు మహా సంపర్క్ అభియాన్ అనే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30 నుండి వచ్చే నెల 30 వరకు ప్రత్యేక డ్రైవ్ రూపంలో ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యవంతులుగా చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాల్సిన పరిస్థితి ఆసన్నమైందన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా కేసీఆర్ ప్రభుత్వం కొర్రీలు పెడుతోందన్నారు. సమావేశంలో నాయకులు ఆదినాథ్, వేణుగోపాల్, అయ్యన్న భూమయ్య, సుహాసినిరెడ్డి, అంకత్ రమేష్, ఎర్రాల మానాజీ, నగేష్, మురళీధర్ ఠాక్రే, మయూర్ చంద్ర, విజయ్, జోగు రవి, జ్యోతిరెడ్డి, ధోని జ్యోతి, సంతోష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల నాయకులు పాల్గొన్నారు.

వరి కోత యంత్రం దగ్ధం

ఖానాపూర్‌రూరల్ : డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పొలంలో 11 కెవి విద్యుత్తు తీగలను గమనించకపోవడంతో వరి కోత యంత్రం దగ్ధమైన ఘటన రాజుర గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పొలంలో వరికొస్తున్న క్రమంలో పైనుండి వెళ్తున్న విద్యుత్ తీగలను డ్రైవర్ గమనించకుండా ఉన్నాడు. దీంతో విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై ప్రమాదం నుండి బయటపడ్డాడు. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తుండగా అగ్నిమాపక సిబ్బంది వచ్చి పూర్తిగా మంటలు ఆర్పేశారు.

జొన్న కొనుగోళ్లకు పరిమితి పెంపు

- 8క్వింటాళ్ల వరకు కొనుగోలుకు అనుమతి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఫలించిన పోరాటం..రైతులకు ఉపశమనం

జొన్న కొనుగోళ్లకు పరిమితి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇది వరకు ఎకరానికి కేవలం 5.16క్వింటాల్‌లు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం తాజాగా ఈ నిర్ణయాన్ని సవరించింది. ఎకరానికి 8క్వింటాల్‌ల వరకు కొనుగోలు చేయాలని గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పూర్తి స్థాయిలో జొన్న పంటను కొనుగోలు చేయాలని రైతులు, రైతు సంఘాలు కొన్ని రోజులుగా ఉద్యమించగా.. ప్రభుత్వం పరిమితి పెంచడంతో అన్నదాతలకు కాస్త ఉపశమనం లభించినట్లయింది. దీంతో రైతులు పండించిన పంటను మార్కెట్‌లో విక్రయించేందుకు అవకాశం లభించనుంది. కానీ రైతు సంఘాలు మాత్రం పరిమితి మరికొంత పెంచితే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో త్వరలోనే జొన్న కొనుగోళ్లకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లాలో రబీ సీజన్‌లో సుమారు 30వేల ఎకరాల్లో జొన్న పంటను సాగు చేశారు. మిగితా మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ ఇదే స్థాయిలో పంట సాగైంది. ప్రస్తుతం కోతలు పూర్తికావస్తున్న దశలో ప్రభుత్వం జొన్న పంటను తొలుత ఎకరానికి కేవలం 5.16క్వింటాల్‌లు మాత్రమే కొనుగోలు చేస్తామని నిర్ణయం తీసుకుంది. దీంతో ఆందోళన చెందిన రైతులు పరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు, రైతు సంఘాలు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపడంతో పాటు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించారు. ఎకరానికి 15క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ నివేదిక అందించిందని.. పండిన పంటలో కొంత మేరకే కొనుగోలు చేస్తే మిగితా పంటను ఎక్కడ విక్రయించాలా అని ఆందోళన చెందారు. దళారులకు తక్కువ ధరకే విక్రయించాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన చెందారు. రైతుల విజ్ఞప్తి మేరకు అధికారులు ఎకరానికి 15క్వింటాల్ వరకు కొనుగోలు చేయాలని



ప్రతిపాదనలు పంపించారు. కానీ ప్రభుత్వం మాత్రం 8క్వింటాల్ వరకు కొనుగోలు చేస్తామని ఉత్తర్వులు జారీ చేసింది.

రైతులకు కాస్త ఉపశమనం..!

ప్రభుత్వం జొన్నపంట కొనుగోళ్లకు సంబంధించి ఎకరానికి 8క్వింటాళ్ల వరకు కొనుగోలు చేస్తామని నిర్ణయం ప్రకటించడంతో అన్నదాతలకు కాస్త ఉపశమనం లభించనుంది. ఎకరానికి 3క్వింటాళ్ల వరకు అధికంగా పెంచడంతో కొంత ప్రయోజనం చేకూరనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కానీ కిందటేడాది ఎకరానికి 11క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ నివేదిక అందించగా.. ప్రభుత్వం ఎకరానికి 10.44క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసింది. ఈ ఏడాది రబీలో మరో 3వేల ఎకరాలు అధికంగా జొన్న సాగు విస్తీర్ణం పెరగడంతో వ్యవసాయశాఖ దిగుబడికి ఎకరానికి 15క్వింటాళ్ల వరకు వస్తుందని నివేదిక అందించింది. రైతుల విజ్ఞప్తి మేరకు మార్క్‌ఫెడ్ అధికారులు సైతం 15క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కానీ ప్రభుత్వం 8క్వింటాళ్లకే పరిమితం చేయడంతో మిగితా పంటను దళారులకు విక్రయించాల్సి వస్తుందని రైతుల నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది.

మరికొంత పరిమితి పెంచితే బాగుంటుంది : బండి దత్తాత్రి, అఖిలపక్ష రైతు సంఘం నాయకుడు



జొన్న కొనుగోళ్లలో ప్రభుత్వం తొలుత ఎకరానికి 5.16క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పింది. పరిమితి పెంచాలని రైతులు విజ్ఞప్తి చేయడంతో తాజాగా 8క్వింటాళ్ల వరకు పెంచింది. ఈ ఏడాది పంట దిగుబడి కూడా పెరగడంతో రెండు, మూడు క్వింటాళ్ల వరకు పరిమితి పెంచితే రైతులకు మరింత మేలు జరుగుతుంది. ప్రభుత్వం ఆ దిశగా నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది.

ఎకరానికి 8క్వింటాళ్ల కొనుగోళ్లకు ఉత్తర్వులు : ప్రవీణ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం,ఆదిలాబాద్

జిల్లా రైతుల విజ్ఞప్తి మేరకు జొన్న కొనుగోళ్లలో పరిమితి పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఎకరానికి 15క్వింటాళ్ల వరకు పెంచాలని ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం 8క్వింటాళ్లు కొనుగోలు చేస్తామని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోళ్లకు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

డిమాండ్ల సాధనకు బోనమెత్తిన వీఓఏలు

నవతెలంగాణ-భైంసా

డిమాండ్లను పరిష్కరించాలని ఐకెపి వివోఏలు నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం బోనమెత్తి నిరసన తెలిపారు. 36రోజులు దాటినా ప్రభుత్వం వారి డిమాండ్లను పరిష్కరించకపోవడంతో ఎంపీడీవో కార్యాలయం నుండి మహాలక్ష్మి టెంపుల్ వరకు డప్పు చప్పుళ్ల మధ్య బోనం కుండలతో అమ్మవారి చెంతకు చేరుకున్నారు. అనంతరం దేవతమూర్తులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వివోఏ సంఘం జిల్లా అధ్యక్షురాలు జైశీల మాట్లాడుతూ నిరవధిక సమ్మె నెల రోజులు దాటినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇకనైనా ముఖ్యమంత్రి కేసీఆర్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. దశాబ్ద కాలంగా అతి తక్కువ వేతనంతో వేలాది మంది పని చేస్తున్నామని, గుర్తింపు నివాల్సిన



బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబా, పరమేశ్వర్, దేవిదాస్, విఠల్‌తో పాటు నాలుగు మండలాల వివోఏలు పాల్గొన్నారు.



ఖానాపూర్‌రూరల్ : 37 రోజులుగా సమ్మె చేస్తున్న వివోఏలు గురువారం పోచమ్మ ఆలయంలో బోనాలు సమర్పించారు. ఎంపీడీవో కార్యాలయం నుండి ప్రధాన దారి పొడవునా పాదరక్షలు లేకుండా కాలినడకన వెళ్లి గాంధీనగర్ పోచమ్మ ఆలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారికి మద్దతుగా నిలిచిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడారు. వివోఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే దిశగా ఆలోచించకుండా కేసీఆర్ ప్రభుత్వం వారిపై ఒత్తిడి చేయడం ఏమాత్రం సరికాదన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 29న చేపట్టిన చలో హైదరాబాద్‌ను వివోఏలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు లావణ్య, వివోఏలు రవీందర్, సురేష్, స్వప్న, మమత, శ్రావణి, అంజన్న, స్వామి, నరేష్, లావణ్య, అశోక్ పాల్గొన్నారు.

రక్షణతో కూడిన పనుల నిర్వహణకు ప్రాధాన్యత

- టీఎస్ఎఫ్‌డీసీ డైరెక్టర్ ఎంజే అక్బర్

నవతెలంగాణ-జైపూర్

నీలగిరి ప్లాంటేషన్‌లో కొనసాగుతున్న పనుల్లో రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఎంజే అక్బర్ సూచించారు. ముదిగుంట శివారులో చేపట్టిన నీలగిరి కటింగ్ పనులను గురువారం ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన కాగితం తయారి కోసం అవసరమైన నీలగిరి కలప కటింగ్ చేపట్టిన సందర్భంగా ప్రమాదాలకు తావివ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రక్షణ చర్యల్లో భాగంగా హెల్మెట్లు, బూట్లు పంపిణీ చేయాలని, కలప కటింగ్ సమయంలో లారీల్లో కలప నింపుతున్నప్పుడు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ శ్రావణి, మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సురేష్ కుమార్, లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ అభివృద్ధి పనులకు రూ.320 కోట్లు మంజూరు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

రాష్ట్రంలోని 9మున్సిపాలిటీలకు రూ.320 కోట్ల కేటాయింపులో భాగంగా ఆదిలాబాద్ మున్సిపాలిటీకి కూడా ఆ మొత్తాన్ని కేటాయించడం పట్ల ఎమ్మెల్యే జోగు రామన్న హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 141 మున్సిపాలిటీలుండగా పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పట్టణ అభివృద్ధి కోసం 9 మున్సిపాలిటీలను గుర్తించారన్నారు. అలా గుర్తించిన మున్సిపాలిటీకి రూ.320 కోట్ల చొప్పున కేటాయిస్తూ ఆదిలాబాద్ మున్సిపాలిటీని కూడా గుర్తించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి రూ.95.55 లక్షలు, నీటి సరఫరా కోసం రూ.226.46లక్షలు కేటాయించారని పేర్కొన్నారు. చనాక-కోర్ట లాంటి ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేస్తూ పట్టణ అభివృద్ధికి కోట్ల రూపాయలను సీఎం కేసీఆర్ మంజూరు చేస్తున్నారని కొనియాడారు. రిమ్స్‌కు 41 అసిస్టెంట్ ప్రొఫెసర్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. అందుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కూడా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ సీఎం కేసీఆర్, హరీష్‌రావును హైదరాబాద్ వెళ్లి కోరనున్నట్లు వివరించారు. రిమ్స్‌లో నాణ్యమైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. గతంలో ఎన్నడూ జిల్లాకు విడుదల కాని నిధులు రాష్ట్రం సిద్ధించిన తర్వాతే విడుదలవుతున్నాయని గుర్తు చేశారు. ప్రజా ఇక్కట్లను దూరం చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న కెసిఆర్, కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమందర్, వైస్ చైర్మన్ జహీర్ రంజాని, పట్టణ అధ్యక్షుడు అజయ్, ఎంపీపీలు మార్శెట్టి గోవర్ధన్, గండ్రత్ రమేష్, నాయకులు మెట్టు ప్రహ్లాద్ పాల్గొన్నారు.

బిల్లులు ఇప్పించండి మహాప్రభో



నవతెలంగాణ-కుభీర్

చేసిన పనులకు బిల్లులు ఇప్పించాలని పలువురు సభ్యులు అధికారులకు మొరపెట్టుకున్నారు. ఎంపీపీ తూము లక్ష్మీబాయి అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సౌన గ్రామంలో రూ.10లక్షలతో ఉపాధి హామీ కింద సీసీ రోడ్డు నిర్మాణ పనులు, అదే విధంగా మన ఊరు మన బడి కింద చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు రావడం లేదని సర్పంచ్ సంగీత, డోడర్నా సర్పంచ్ శంకర్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఏడాది కింద చేసిన పనులకు బిల్లు ఇప్పించాలని ఆ శాఖ అధికారులకు ఎన్నోసార్లు ఫోన్లు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. వేసవి కాలంలో తాగునీటి సమస్య చర్చించాల్సి ఉండగా మిషన్ భగీరథ అధికారులు తమ కింది స్థాయి సిబ్బందిని పంపించడం పట్ల ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్సైజ్ శాఖ అధికారి రాజేశ్వర్ మాట్లాడుతుండగా కల్తీ తెల్లకల్లు విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, అయినా పట్టించుకోవడం లేదని చోండి సర్పంచ్ చంద్రకాంత్ అన్నారు. అనంతరం విద్యుత్ శాఖపై అధికారి సమావేశానికి రాకపోవడంతో కింది స్థాయి అధికారులు రావడంతో సోనారి, నిగ్వా గ్రామాలకు వెళ్లే మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు సరిచేయాలని మండల కోఆప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్ సమావేశం దృష్టికి తీసుకొచ్చాడు. ఇటీవల ఎంపీడీఓగా వచ్చిన లింబాద్రిని ఎంపీటీసీలు సన్మానించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మోహినుద్దీన్, ఎంపీడీఓ లింబాద్రి, తహసీల్దార్ విశ్వంబర్, ఎంఈఓ చంద్రకాంత్, పశువైద్యాధికారి సరోత్తం, సర్పంచుల సంఘం అధ్యక్షుడు దత్తుగౌడ్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలే విక్రయించాలి



నవతెలంగాణ-జైపూర్

ఖరీఫ్ పంటల సాగుకు సంబంధించి రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్ సూచించారు. ఎస్సై ఉపేందర్‌రావుతో కలిసి గురువారం రైతువేదికలో విత్తన డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తన డీలర్లు నాణ్యత ప్రమాణాలను దృష్టిలో పెట్టుకుని రైతులకు దిగుబడి ఇచ్చే విత్తనాలు విక్రయించాలని సూచించారు. చీడపీడలు, వాతావరణ పరిస్థితులను తట్టుకునే విత్తన రకాలను సిఫారస్ చేయాలని సూచించారు. విత్తనాలు విక్రయిస్తున్నప్పుడు వెనువెంటనే రైతుకు నగదు రశీదు ఇవ్వాలని తెలిపారు. విత్తన గోదాములు శుభ్రంగా ఉంచడంతో పాటు విత్తనాల నిల్వలు ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలను నియంత్రించడం కోసం చేపడుతున్న చర్యల్లో భాగంగా నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్సై ఉపేందర్‌రావు హెచ్చరించారు. అదేవిధంగా గుర్తు తెలియని వ్యక్తులకు, రైతులు కాదనుకున్న వారికి పురుగుమందు విక్రయించకూడదని తెలిపారు. విత్తన దుకాణాలలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల నుండి జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఈఓ కొమురయ్య, అరుణ్, డీలర్లు పాల్గొన్నారు.

సబ్సిడీ జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధం

మండల రైతుల సౌకర్యార్థం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్ తెలిపారు. 65 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలు పంపిణీ చేయనుండగా అవసరమైన రైతులు పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలను ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో అందజేయాలని తెలిపారు. 200 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉండగా సబ్సిడీ పోను బస్తా ఒకంటికి రూ.843 చెల్లించి కొనుగోలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. బస్తా రెండున్న ఎకరాలకు అవసరమవుతుందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే జోగు రామన్నకు పరామర్శ

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



ఎమ్మెల్యే జోగు రామన్నను బిఆర్ఎస్ జిల్లా నాయకులు గురువారం ఆయన నివాసంలో పరామర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే కంటికి చిన్నపాటి గాయం కావడంతో సమాచారం తెలుసుకున్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు ఆయనను కలిశారు. ఎమ్మెల్యే యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీ గొడం నగేష్, డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, వైస్ చైర్మన్ జహీర్ రంజాని, జడ్పీటిసి తాటిపెల్లి రాజు, బాలూరి గోవర్ధన్‌రెడ్డి, మెట్టు ప్రహ్లాద్, సాజిదొద్దిన్ ఉన్నారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ముథోల్

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ బిజెపి నాయకులు మోహన్‌రావు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని ముద్గల్, న్యూ ముద్గల్, సరస్వతినగర్, పిప్రి గ్రామాలలో నిర్వహించిన పల్లె పల్లెకు బిజెపి-గడపగడపకు మోహన్‌రావు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గడపగడపకు వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బిజెపి ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు, రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వంతో ప్రజలకు మేలు చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి సుభాష్ జాదవ్, నాయకులు సాయిలు, మానిక్, సాయినాథ్, పోతన్న, జీవన్, యాదాగౌడ్ పాల్గొన్నారు.

సీఎం సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైదరాబాద్‌లోని నూతన సచివాలయంలో సీఎం కేసీఆర్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు, 9వ విడత హరితహారం, పోడు పట్టాల పంపిణీ, పేదలకు ఇండ్ల స్థలాల పంపిణీపై రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్షించారు.

హజ్ యాత్రలో ప్రపంచ శాంతి కోసం ప్రార్థించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

హజ్ యాత్రలో ప్రపంచ శాంతి కోసం ప్రార్థించాలని ఎమ్మెల్యే జోగు రామన్న హజ్ యాత్రికులను కోరారు. గురువారం టీఎన్జీవోస్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులకు వ్యాక్సినేషన్ ప్రారంభించారు. అంతకుముందు జిల్లా హజ్ సొసైటీ తరఫున ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హజ్ యాత్రికులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. పట్టణంలో హజ్ సొసైటీ భవనాన్ని రెండు కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షాహిద్ హైమద్, సభ్యులు ఆసిఫ్ ఉద్దీన్, హసీబ్, నూర్‌ఖాన్, ఫరూఖ్ పాల్గొన్నారు.

సివిల్స్‌లో ర్యాంకు సాధించిన డోంగ్రి రేవయ్యకు సన్మానం



నవతెలంగాణ-రెబ్బెన

కుమురంభీం జిల్లా ఏర్పాటైనప్పటి నుండి మొట్టమొదటి సారి సివిల్ సర్వీసెస్ పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకు సాధించి జిల్లాకు వన్నెతెచ్చిన డోంగ్రి రేవయ్యను పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు గురవారం ఘనంగా సన్మానించారు. మారుమూల ప్రాంతమైన రెబ్బెన మండలంలోని తుంగెడ గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించి దేశంలోనే అత్యున్నతమైన సివిల్స్ పరీక్షలో 410 ర్యాంకు సాధించి జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తెచ్చిన రేవయ్యను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. తన విద్యాభ్యాసం ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో చదివి ఈ స్థాయికి చేరడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు ఏట్కూరి శ్రీనివాస్‌రావు, సునార్కర్ అనిల్, ఎనగంటి భిక్షపతి, ముంజంపల్లి రమేష్, ఇందారపు ప్రకాష్, రేకల్ల వెంకటేశ్వర్లు, రాజకమలాకర్ రెడ్డి, దుర్గం లింగయ్య, నాగరాజు, మోతిరావు, దుర్గం శ్రీనివాస్, దుర్గం రాజ్‌కుమార్, రాజన్న, జాడి మనోహర్ పాల్గొన్నారు.

రేవయ్యకు ఘన స్వాగతం

గురువారం యూపీఎస్‌సీలో సివిల్స్ పరీక్షలో అత్యుత్తమ ర్యాంకు సాధించి మండలానికి చేరుకున్న డోంగ్రి రేవయ్యకు మండలవాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో రేవయ్యను పూలమాలలతో సత్కరించి స్వీట్లు తినిపించారు. ఎంపీడీఓ కార్యాలయం నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు రేవయ్యను కారులో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఎంపీపీ జుమ్మిడి సౌందర్య రేవయ్యను ఘనంగా సన్మానించారు.

రేపు పద్మశాలి సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికల్లో పాల్గొనడానికి 18 సంవత్సరాలు నిండిన పద్మశాలి కుల బాంధవులు శనివారం పెద్దవాగు ఒడ్డున గల మార్కండేయ దేవాలయంలో నిర్వహించే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సభ్యత్వం పొందాలని సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చెన్నూరు అశోక్, బండి శ్రీనివాస్‌లు ఒక ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో జిల్లాలోని పద్మశాలి సంఘం యువత పాల్గొనాలని కోరారు.

తహసీల్దార్ సంతోష్‌కు సన్మానం

నవతెలంగాణ-బాసర

తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న సంతోష్‌కుమార్‌ను గురువారం ప్రజాప్రతినిధులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్‌రావు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ రామారావు, నర్సురి నరేష్ పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో నడిచే బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 3, 5, 8 తరగతి ప్రవేశాల కోసం జూన్ 2 లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని మణెమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తుల నుంచి జూన్ 7వ తేదీన లక్కీ డ్రా నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి గల వారి జిల్లా కార్యాలయంలో తమ దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

మహిళా సంఘాల లావాదేవీలు సులభం

- అందుబాటులోకి 'లోకోస్ అప్లికేషన్' సాంకేతికత
- జాతీయస్థాయిలో ఒకే గొడుగు కిందికి మహిళా సంఘాలు



నవతెలంగాణ- ఆసిఫాబాద్

మహిళా సంఘాల లావాదేవీలు సులభతరం చేయడానికి సాంకేతికతను జోడించడం దేశవ్యాప్తంగా ఒకే గొడుగు కిందికి మహిళా సంఘాలను తీసుకురావడానికి ప్రభుత్వం లోకోస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బీహార్ జార్కండ్ రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తుండగా, రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్న ఈ విధానాన్ని మే ఒకటి నుండి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మహిళా సంఘాలకు సాంకేతికత తోడు కావడంతో పాటు లావాదేవీలు మరింత సులభతరం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

సాంకేతికతతో లావాదేవీలు సులభతరం

మహిళా సంఘాల్లో లావాదేవీలు నిర్వహించడానికి గతంలో "అకౌంట్ మొబైల్ యాప్" అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనిలో సభ్యులు సమాచారాన్ని నిక్షిప్తం చేయవలసి వచ్చేది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మహిళా సంఘాలు అనుసరించే సాంకేతిక విధానంలో మార్పులు ఉండడంతో లావాదేవీలు కొంత ఇబ్బందిగా మారాయి. ప్రస్తుతం తీసుకోవాల్సిన "లోకోస్ యాప్" ద్వారా లావాదేవీలు సులభతరం కావడంతో పాటు వేగంగా అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం కొత్తూరులో అందుబాటులోకి రాగా యాప్ ద్వారా జరిగిన లావాదేవీలతో ఆ మహిళా సంఘం ఉత్తమ మహిళా సంఘంగా అవార్డు కూడా తీసుకుంది.

లోకోస్ యాప్ తో అందుబాటులో సమాచారం

ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన లోకోస్ అప్లికేషన్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందుబాటులో ఉండనుంది. జాతీయస్థాయిలో అధికారులు సంఘం వివరాలు నేరుగా నమోదు చేస్తారు. పేదరిక నిర్మూలనకు రాష్ట్రాల మధ్య పోటీ పెరిగే అవకాశం ఉంటుంది. సంఘ సభ్యులు ఆర్థిక, విద్యార్హత, జీవనోపాధి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది. సంఘాలలో బాగా పనిచేసే వ్యక్తులను గుర్తించి ఇతర ప్రాంతాలకు పంపించే అవకాశాలు కూడా ఉంటాయి. గ్రామీణ లకు సాంకేతికత అలవాటు చేయడం కూడా వీలవుతుంది. సంఘంలోని సభ్యులకు సంబంధించిన పూర్తి సమాచారం తోపాటు సంఘాల సమాచారం కూడా అందుబాటులో ఉండనుంది.

పనిలో పెరగనున్న వేగం

శ్రీనివాస్, ఏపీడి, గ్రామీణ అభివృద్ధి శాఖ



గతంతో పోలిస్తే సంఘాలలో పనిలో వేగం పెరిగే అవకాశం ఉంది. అలాగే సంఘంలోని సభ్యులకు సంబంధించిన పొదుపు పెట్టుబడి కి సంబంధించిన సమాచారంతో పాటు రుణానికి సంబంధించిన సమాచారం కూడా తెలుస్తుంది. రుణాల రికవరీ, రుణాల మంజూరు సులభం అవుతుంది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో అప్లికేషన్ ఉండడంతో ప్రతి సమాచారం జాతీయ స్థాయిలో తెలుస్తోంది.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



నవతెలంగాణ-రెబ్బెన

మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసే విధంగా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ భవనాలు, మన ఊరు మన-బడి పనులపై విద్యాశాఖ, శిశు సంక్షేమ శాఖల అధికారులతో ఆమె మాట్లాడుతూ పాఠశాలలు, భవనాలు, ప్రహరీగోడలు త్వరగా పూర్తిచేయాలన్నారు. మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల నిర్దేశిత లక్ష్యాన్ని త్వరితగతిన సాధించే విధంగా అధికారలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మండలంలో మంజూరైన అంగన్‌వాడీ భవనాలు, అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా అధికారులు దృష్టిసారించాలన్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సౌకర్యాల పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో ఉండి మంచినీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మండలంలోని నారాయణపూర్ గ్రామ పంచాయతీలో గల పైకాజీగూడ గ్రామానికి పాఠశాల భవనం నిర్మించి త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల పనుల మరమ్మత్తులు, అంగన్‌వాడీ భవనాల మరమ్మత్తు పనులను చేపట్టాలన్నారు. మన ఊరు మన బడి కార్యక్రమం మొదటి విడతలో ఎంపికైన పాఠశాలలో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా సిద్ధం చేయాలన్నారు. పాఠశాలలో చేపట్టిన మరమత్తులు, మూత్రశాలలు, త్రాగునీరు ఇతర పనులను పూర్తిచేసే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, జడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ మల్లిఖార్జున్, వైస్ ఎంపీపీ గజ్జెల సత్యనారాయణ పాల్గొన్నారు.

విభేదాలు లేవు..కలిసి పని చేస్తాం : కాంగ్రెస్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమిష్టి కృషితో పనిచేసి ఆదిలాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురేద్దామని మాజీ మంత్రి చిల్కూరి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు అందరూ సమిష్టి కృషితో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ నియోజకవర్గ నాయకులను, కార్యకర్తలను భుజం తట్టి నడిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని దిశా నిర్దేశం చేశారు. ఈ నెల 26న జైనథ్ మండలంలోని బెల్లూరి గ్రామంలో గడప గడపకు కాంగ్రెస్ నినాదంతో వరంగల్ రైతు డిక్లరేషన్, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ కార్యక్రమాలను తీసుకెళ్తామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేసేలా చూస్తామన్నారు. అధిష్టానం ప్యారసూట్ అభ్యర్థులకు టికెట్లు ఇవ్వబోదని, కాంగ్రెస్ పార్టీకి లాయల్‌గా ఉన్న అభ్యర్థికే టికెట్ కేటాయిస్తుందని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ స్పష్టం చేశారు. నేటి నుండి అందరం కలిసికట్టుగా సమిష్టి కృషితో ఆదిలాబాద్ నియోజకవర్గ గడ్డపై కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పాటుపడతామని టీపీసీసీ కార్యదర్శి గండ్రత్ సుజాత తెలిపారు. ఇవాళ కాంగ్రెస్ పార్టీ వైపు ప్రజలందరూ చూస్తున్నారని, కలిసికట్టుగా ఏకతాటిపైకొచ్చి పనిచేస్తే పార్టీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి అన్నారు. తమలో టికెట్ ఎవరికి వచ్చిన మిగతా వాళ్ళ వాళ్లకి సపోర్ట్‌గా ఉంటామని స్పష్టం చేశారు. అమెరికా నుండి దిగొచ్చి డబ్బులు ఖర్చు పెట్టినంత మాత్రాన టికెట్లు రావని హితవు పలికారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్, మున్సిపల్ మాజీ చైర్మన్ దిగంబర్‌రావ్ పాటిల్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కాడే సంతోష్, ఖలీం, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ అంబకంటి అశోక్, ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ సెడ్మకి ఆనంద్‌రావు, మావల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌గౌడ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు రంగినేని శాంతన్‌రావ్, ఆదిలాబాద్ యువజన ఎస్టీ సెల్ వైస్ చైర్మన్ గెడం రవి పాల్గొన్నారు.

వేతనాల కోసం ప్రత్యేక గ్రాంట్ కేటాయించాలి

నవతెలంగాణ-రెబ్బెన

గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్‌ను కేటాయించాలని, ఈ గ్రాంట్ నుండే వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. గురువారం గోలేటిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది కారోబార్, బిల్ కలెక్టర్, స్వీపర్, ఎలక్ట్రీషన్, వాటర్‌మెన్, డ్రైవర్ తదితరుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉంటాయని, ఆందోళన కార్యక్రమాల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, పీఆర్‌సీలో నిర్ణయించిన మినీమం బేసిక్స్‌ను వేతనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15600, బిల్ కలెక్టర్, కారోబర్‌కు రూ.19500, కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ.22750 వేతనంగా చెల్లించాలన్నారు. 2011 జనాభా ప్రాతిపదికన కాకుండా అవసరమున్న చోట జనాభా అనుకూలంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. ప్రతినెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలన్నారు. జీవో నెంబర్ 51ను సవరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్‌కు స్పెషల్ స్టేటస్ కల్పించాలని, వారికి పంచాయతీ అసిస్టెంట్ల హోదా కల్పించాలన్నారు. ప్రతి వర్కర్‌కు ఇన్సూరెన్స్ రూ.5 లక్షలు అమలుచేయాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని, దహన సంస్కరణలకు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని, ఏడాదికి మూడు జతల యూనిఫామ్, చెప్పులు, సబ్బులు, నూనె ఇవ్వాలని, వాటికి నగదు రూపంలో అలవెన్సులు చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, 8 గంటల పని దినాన్ని అమలుచేయాలని, పండుగ సెలవులు, జాతీయ సెలవులను అమలుచేయాలన్నారు. కార్మికులపై రాజకీయ నాయకుల వేధింపులు, అక్రమ తొలగింపులు వెంటనే ఆపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు దుర్గం తిరుపతి, సాంబగౌడ్, గ్రామ పంచాయతీ సిబ్బంది సరోజ పాల్గొన్నారు.

సంచార వైద్య సేవలతో పల్లె ప్రజకు మేలు

- జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సంచార వైద్య సేవల ద్వారా గ్రామీణలకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. మండలంలోని శాఖనుగొంది గ్రామంలో నిర్వహిస్తున్న మొబైల్ ఆసుపత్రి వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి మొబైల్ ఆసుపత్రి ఏర్పాటు చేసినట్లు వివరించారు. రూ.రెండు కోట్ల వ్యయంతో దీనిని అందుబాటులోకి తీసుకవచ్చామన్నారు. దీని ద్వారా డాక్టర్లచే పరీక్షలు, రక్త పరీక్ష లాంటివి నిర్వహించి అవసరమైన మందులు అందజేయడం జరుగుతుందన్నారు. చిన్నపాటి వైద్యానికి మండల జిల్లా కేంద్రాలకు రాకుండా ఈ మొబైల్ ఆసుపత్రి ఉపయోగపడుతుందని సూచించారు. గ్రామీణ ప్రజల ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సత్యనారాయణ, మేఘన, హర్ష, అమీన్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆలయ హోం గార్డ్స్



నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవి అమ్మవారి దర్శనానికి వచ్చిన హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు గురువారం ఆలయ ప్రాంగణంలో బంగారు గాజులు పోగొట్టుకుంది. విధుల్లో ఉన్న హోంగార్డ్ రాందాస్, సురేష్‌కు దొరకడంతో ఆలయ ఈవో విజయరామారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈవో ఆలయ సిబ్బందితో ఆలయంలో అనౌన్స్‌మెంట్ చేయించారు. బంగారు గాజులు భక్తురాలివని నిర్ధారించుకొని హోంగార్డ్స్ ఆలయ ఈవో సమక్షంలో భక్తురాలికి అందజేశారు. వారి నిజాయితీని భక్తులు, స్థానికులు అభినందించారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశాల ఎంపిక జాబితా విడుదల

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశానికి సంబంధించిన ఎంపిక జాబితా విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఏప్రిల్ 16న నిర్వహించిన ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం మొత్తం 100 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపిక జాబితా పాఠశాల నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 26 నుండి 31వ తేదీ వరకు ఒరిజనల్ టీసీ, బోనఫైడ్, కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, 2ఫోటోలపాటు 2 సెట్లు జిరాక్స్ కాపిలతో ధృవ పత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. నిర్ణీత సమయంలోగా హాజరు కాని విద్యార్థుల అడ్మిషన్ రద్దు చేయబడుతుందని తెలిపారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా జ్యోతిరెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా చిలుకూరి జ్యోతిరెడ్డి నియమితులయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో పార్టీ అధికార ప్రతినిధిగా ఆమెను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఇన్చార్జి అల్జాపూర్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ ఆమెను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు.

పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు

- పర్సనల్ మేనేజర్ ఐ.లక్ష్మణ్‌రావు



నవతెలంగాణ-రెబ్బెన

గోలేటిలోని జీఎం కార్యాలయంలో గురువారం ఉద్యోగులకు నివాస క్వార్టర్ల కౌన్సిలింగ్ నిర్వహించారు. మాదారం, గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి క్వార్టర్ల కోసం 35 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ఉద్యోగుల నివాస గృహాల కేటాయింపు పారదర్శకంగా సాగుతుందన్నారు. ఉద్యోగులు కేటాయించిన క్వార్టర్లలో నివాసం ఉండకుండా అద్దెకు ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సింగరేణి క్వార్టర్లను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, జూనియర్ అసిస్టెంట్ తిరుమల పాల్గొన్నారు.

జియో 5జీ సేవలు ప్రారంభం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పట్టణంలో స్థానిక రాజీవ్ చౌక్ చౌరస్తాలో జీయో వారి 5జీ సేవలను గురువారం స్థానిక పట్టణ ఎస్సై బి.అశోక్ కేక్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీయో డిస్ట్రిబ్యూటర్ రాజు మాట్లాడుతూ పట్టణ ప్రజలు 5జి సేవలను సద్వినియోగం చేసుకోవాలని, హై లెవెల్ డేటా స్పీడ్ తో నడుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీయో మేనేజర్ సుధీర్ కుమార్ రెడ్డి, జీయో ఏజెంట్స్, కోళ్ల శ్రీనివాస్, రాజీవ్ చౌక్ వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు

డీలర్‌షిప్‌ను ఎస్టీకి కేటాయించాలని వినతి

నవతెలంగాణ-కాసిపేట



కాసిపేట మండలంలోని ముత్యంపల్లి రేషన్ షాప్ డీలర్ను ఎస్టీకి కేటాయించాలని కోరుతూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో ఆర్డీఓ శ్యామలాదేవికి వినతిపత్రం అందించారు. ఇటీవల విడుదల చేసిన రేషన్ షాప్ డీలర్ల నియామకంలో ముత్యంపల్లి రేషన్ డీలర్ షాప్‌ను రిజర్వేషన్‌ను బీసీబీకి కేటాయించారని, ఏజన్సీ ప్రాంతం కావడంతో ఎస్టీకి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి మడావి వెంకటేశ్, మడావి గంగారాం, పెంద్రం తిరుపతి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఎదుట వీఓఏల నిరసన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

గత 39 రోజులుగా ఐకేపీ వీఓఏలు సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో గురువారం వీఓఏలు కాగజ్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గంట పాటు నిరసన చేపట్టిన అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ వీఓఏలు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, ఉద్యోగ భద్రత, కనీస వేతనాల లాంటి న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేపడుతున్నా ప్రభుత్వం నుండి స్పందన లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించని పక్షంలో ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు జాడి రాంచందర్, ఎం రాజేశ్వర్, ధన్‌రాజ్, పెంటయ్య, శ్రీనివాస్, గీత, వనిత, అంజలి, లత, కళ్యాణి, ప్రమీల పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ



నవతెలంగాణ-దహెగాం

మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 65 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలను గురువారం జడ్పీటీసీ శ్రీరామారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు జీలుగ విత్తనాలను పంట చేన్లలో వేసి ఎరువులు తయారుచేసుకోవచ్చన్నారు. 30 కిలోల విత్తనాలకు పూర్తి ధర రూ.2408 కాగా ప్రభుత్వం సబ్సిడీపై రూ.1565 పోను మిగతా రూ.843 రైతులు చెల్లించి తీసుకోవాలన్నారు. విత్తనాలు కావాల్సిన వారు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా జిరాక్స్ ప్రతులతో సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ, మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ, ఏఈఓలు శోభన్, వెన్నెల, సుశ్మిత, దీపక్, పీఏసీఎస్ సీఈఓ బక్కయ్య రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సౌకర్యాలు కల్పించాలని డీఎం గోపాల్ అన్నారు. గురువారం ఎలుకపెల్లి గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరిధాన్యాన్ని ఆరబెట్టి తేమ లేకుండా చూసుకోవాలని, తాలు, మట్టి లేకుండా జాగ్రత్త పడాలని రైతులకు సూచించారు. అనంతరం రైతులు తీసుకొచ్చిన ధాన్యంలోని తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ధాన్యం అమ్మేటప్పుడు ఆధార్‌కార్డు, పట్టా పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా పత్రాలను అందించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి లావణ్య, ఏపీఎం కోనయ్య పాల్గొన్నారు.

ఎంసెట్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ర్యాంకు

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంసెట్‌లో అర్హత ర్యాంకు సాధించారు. బైపీసీ విద్యార్థిని ఆడె శైలజ 27534 ఎంసెట్‌లో కుమురం భీం జిల్లాలో మూడో ర్యాంకు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ సంపత్‌కుమార్ తెలిపారు. ఆమెతో పాటు కళాశాలలో మొత్తం 28 మంది విద్యార్థులు ఎంసెట్ పరీక్షకు హాజరుకాగా 18 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ప్రిన్సిపల్ సంపత్‌కుమార్‌తో పాటు కళాశాల అధ్యాపకులు అర్హత సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

28న 2కే రన్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-వాంకిడి

కుమురంభీం జిల్లా కేంద్రంలో తెలంగాణ ఆదివాసుల దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన నిర్వహించే 2కే రన్‌ను విజయవంతం చేయాలని వాంకిడి ఎస్సై సాగర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గెలుపొందిన వారికి మొదటి, ద్వితీయ బహుమతులు అందజేయడం జరుగుతుందని, 2కే రన్‌లో ఆసక్తి కలిగిన యువతి, యువకులు అందరు పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు. 2కే రన్ 28వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

అందుబాటులో సబ్సిడీ జీలుగ విత్తనాలు

నవతెలంగాణ-భీమారం

సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు మండల వ్యవసాయ అధికారి కె.మార్క్ గ్లాడ్‌స్టన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 65 శాతం సబ్సిడీపై అందించే 30 కేజీల జీలుగ విత్తనాల బ్యాగు రూ.843 రూపాయలకు భీమారం ఆగ్రోస్ రైతు సేవాకేంద్రంలో 100 క్వింటాల్లు అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. 2.5 ఎకరాలకు సరిపడు 30 కేజీల గల ఒక జీలుగ బ్యాగు కావాల్సిన రైతులు తమ పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్ జీరాక్స్ కాపీలతో భీమారం ఆగ్రోస్ రైతు సేవాకేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

నిషేధిత గడ్డి మందు పట్టివేత

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని రాళ్లగూడ గ్రామంలో 30 లీటర్ల నిషేదిత గడ్డి మందును పట్టుకొని వగాడి సంతోష్ అనే వ్యక్తిపై కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేదిత పత్తి విత్తనాలు, గడ్డి మందును విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కుమురంభీం ఆశయ సాధన బీఆర్ఎస్ కృషి

నవతెలంగాణ-తాండూర్



జల్, జంగిల్, జమీన్ అనే నినాదంతో గిరిజన హక్కులకై పోరాడిన కుమురంభీం ఆశయాలను బీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. గురువారం మండలంలోని నర్సాపూర్ గిరిజన గ్రామంలో కుమరంభీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆదివాసీలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. గిరిజన తండాలలో నెలకొన్న సమస్యలను గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ చిన్న చిన్న తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి తండాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గిరిజన అభివృద్ధి సంస్థ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. గిరిజన హక్కుల పోరాటాలను పరిగణలోనికి తీసుకున్న ప్రభుత్వం పోడు భూములకు హక్కు పత్రాలు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించిందని తెలిపారు. యువత కుమురభీం అడుగుజాడల్లో నడిచి గిరిజన భావితరాలకు బాసడగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కుమురంభీం మనవడు సోనే రావు, సింగరేణి జీఎం దేవేందర్, ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్, జడ్పీటీసీ సలిగామ బానయ్య, నర్సాపూర్ సర్పంచ్ జంగు బాయి, ఎంపీటీసీ రెబ్బన యశోద, సభ్యులు రహమత్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు, నాతరి స్వామి, ఎంపీటీసీలు, ఆదివాసి తుడుం దెబ్బ నాయకులు బాపురావు పాల్గొన్నారు.

రూ.500 కోట్లతో గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- గల్ఫ్ కార్మికుని మృతదేహంతో నిరసన

నవతెలంగాణ-జన్నారం



గల్ఫ్ కార్మికులకు రూ.500 కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని గల్ఫ్ సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలెడ భూమయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గత వారం రోజుల క్రితం ఒమన్ దేశంలో గుండెపోటుతో మృతి చెందిన కవ్వాల్ గ్రామానికి చెందిన అనంతయ్య మృతదేహంతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. బతుకుదెరువు కోసం ఇతర దేశాలకు వెళ్లి అనారోగ్యాల పాలై మృతి చెందిన గల్ఫ్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ఆ దేశాల నుంచి మృతదేహాలను ఇండియాకు తెప్పించడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. అవ్వాల్ గ్రామానికి చెందిన అంబటి అనంతయ్య మృతదేహాన్ని గల్ఫ్ సంక్షేమ సమితి గల్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో ఇండియాకు తెప్పించడం జరిగిందన్నారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ అమరగొండ తిరుపతి, మల్లికార్జున్, మగ్గిడి తిరుపతి, దుమల్ల ఎల్లయ్య, జేఏసీ రాష్ట్ర నాయకులు స్వదేశ్ పరికిపండ్ల, మంద భీంరెడ్డి, పరకాల మహేష్, పన్నీరు నరేంద్ర, తల నర్సయ్య, గోపాల్, పోశం, రవీందర్, కుమార, మహేష్ పాల్గొన్నారు.

బీఆర్క్ ఫలితాల్లో సీఓఈ ఉత్తమ ర్యాంకులు



నవతెలంగాణ-తాండూర్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ప్రకటించిన జేఈఈ మెయిన్స్ బిఆర్క్ ఫైనల్ ఫలితాల్లో గురుకులం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ బెల్లంపల్లి విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ అయినాల సైదులు తెలిపారు. బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్ట్ విభాగంలో కళాశాల విద్యార్థి పొట్టల విష్ణు 97.82 శాతంతో జాతీయస్థాయిలో 42వ ర్యాంకు సాధించాడు. అదేవిధంగా అల్లూరి శివకుమార్ 96.28 శాతంతో జాతీయస్థాయిలో 86వ ర్యాంకు సాధించాడు. కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా జాతీయస్థాయిలో ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్టు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన బెల్లంపల్లి సీఓఈ మరోసారి సత్తా చాటిందని తెలిపారు. ఈ ర్యాంకుల ఆధారంగా దేశంలోనే అత్యున్నతమైన ఐఐటిలో ఇద్దరికి సీటు వస్తుందని ఆయన తెలిపారు.

ఎంసెట్‌లోనూ ఉత్తమ ర్యాంకులు

గురువారం ప్రకటించిన ఎంసెట్ ఫలితాల్లో సీఓఈ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో 30 మంది పరీక్షకు హాజరు కాగా 29 మంది క్వాలిఫై అయ్యారు. వీరిలో ఎస్.వినయ్ 11058 ర్యాంకుతో కళాశాల టాపర్‌గా నిలిచాడని తెలిపారు.వ్యవసాయ విభాగంలో 29 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుగా అందరూ క్వాలిఫై అయ్యారు. వీరిలో బొట్ల రాము 10634 ర్యాంకుతో టాపర్‌గా నిలిచినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు.

నియోజకవర్గానికి సాగునీరు అందించాలి

- బీజేపీ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు

నవతెలంగాణ-సిర్పూర్(టి)



సిర్పూర్ నియోజకవర్గంలోని వ్యవసాయ భూములకు సాగునీరు అందించాలని బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. గురువారం పల్లెపల్లెకు పాల్వాయి గడపగడపకు బీజేపీ 17వ రోజు పాదయాత్రలో భాగంగా మండలంలోని మాకిడి, జక్కాపూర్, హుడ్కిళి, నవెగాం, దుబ్బగూడ గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగానికి సాగునీరు అందకపోవడంతో భూములన్ని బీటలు బారి నిరుపయోగంగా మారాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తుమ్మిడిహేటి వద్ద నిర్మించాల్సిన ప్రాజెక్టును కాళేశ్వరం వద్ద నిర్మించడంతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, అలాగే 17 లిఫ్టిరిగేషన్ల స్కీంల క్రింద ఉన్న 33 వేల ఎకరాల సాగుభూమి పడావు పడి ఉన్నాయని, మరమ్మత్తులు చేయించలేని ప్రభుత్వం మనకు అవసరమాని అన్నారు. వర్ధా నదిపై ఉన్న లోనవెల్లి, హుడ్కిళి, సాండ్‌గాం ఎత్తిపోతల పథకాలు మరమ్మత్తులకు నోచుకోక రైతుల పంట పొలాలకు సాగునీరు అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని, కనీసం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఏనాడు ఈ సమస్యపై దృష్టి సారించకపోవడం బాధాకరమన్నారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడగానే వర్ధా నది పరివాహక ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాల మరమ్మత్తులు చేయించడంతో పాటు నది వెంబడి కరెంటు కనెక్షన్ ఇస్తామని తద్వారా రైతులు వర్ధా నది నీటిని పొలాలకు మళ్లించుకొనే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఎలుములె శంకర్, జక్కాపూర్, హుడ్కిళి ఉప సర్పంచ్‌లు టాంకె ఆనంద్, శ్యాంరావు, రాచర్ల మహేష్ యాదవ్, చౌదరి భగవాన్, బనార్కర్ సాయి, శంకర్, వికాస్, ప్రవీన్, ప్రఫూల్ పాల్గొన్నారు.

6న బహిరంగ వేలం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఇటీవల నూతనంగా నిర్మించిన తొమ్మిది వాణిజ్య గదులను ఐదేళ్ల పాటు అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు జూన్ ఆరో తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమీషనర్ అంజయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 29 నుండి జూన్ మూడో తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా రూ. 25 వేలు ధరావత్తు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వేలంలో గది పొందిన వ్యక్తి 15 రోజుల వ్యవధిలో గుడ్‌విల్ కింద రూ. 2,04,570 నాన్ రిఫండబుల్ మొత్తాన్ని చెల్లించి ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎస్సీకి ఒకటి, ఎస్టీకి ఒకటి చొప్పున కేటాయించనున్నట్లు తెలిపారు. మూడో తేదీ సాయంత్రం ఐదు గంటల తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని, వేలంలో గది పొందిన వ్యక్తి గుడ్‌విల్ చెల్లించనితో ఆ పాటను రద్దు చేసే అధికారం కమిషనర్‌కు ఉందని తెలిపారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా ఆధ్వర్యంలో మండలంలోని శంకర్ పల్లి గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి.మోహన్‌రెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ సోషల్ వెల్ఫేర్ యాక్టివిటీలో భాగంగా శంకర్‌పల్లి గ్రామంలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ వైద్య శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులైనటువంటి బీపీ, షుగర్ వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ సదవకాశాన్ని గ్రామస్తులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఏ.రాజేశ్వర్‌రెడ్డి, శంకర్ పల్లి గ్రామ సర్పంచ్ సదానందం, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, టీబీజీకెఎస్ నాయకులు మిట్టపల్లి సూర్యనారాయణ, కేకే గ్రూప్ ఏజెంట్ రాందాస్, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ ఉష, డాక్టర్ పి.జనార్ధన్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యామ్ సుందర్, పర్యావరణ అధికారి ప్రభాకర్, కేకే-5 గని మేనేజర్ శంకరయ్య, డీవై పీఎం మైత్రేయబంధు పాల్గొన్నారు.

కాసిపేట గనిపై కార్మికులకు, కళాశాల సిబ్బందికి అవగాహన

నవతెలంగాణ-కాసిపేట

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే సింగరేణి మహిళ డిగ్రీ కాలేజీ సిబ్బంది కాసిపేట గనిపై గురువారం ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ డిగ్రీ కాలేజీలో నాణ్యత కల్గిన విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, జాతీయస్థాయిలో తగినటువంటి ప్రమాణాలతో బోధనను అందిస్తామని అన్నారు. నాక్ గుర్తింపు పొందిన ఏకైక కాలేజి అని అన్నారు. మహిళ విద్యార్థులకు రక్షణతో కూడిన, హాస్టల్ వసతులు కల్పించడం జరుగుతుందని అన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రొపెసర్ స్థాయి అధ్యాపకులు, విశేష అనుభవం కలిగిన వారు ఉన్నారని సింగరేణి మహిళ డిగ్రీ కాలేజిని ఉద్యోగులు ఉపయోగించుకోవాలని ప్రొపెసర్ సస్రీన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేష్, పిట్ సెక్రెటరీలు మీనుగు లక్ష్మినారాయణ, బైరి శంకర్, సంక్షేమ అధికారి మీర్జా గౌస్, అండర్ మేనేజర్ దిలీప్, ఓవర్ మెన్ మహేష్ పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు అల్లూరి లోకేష్ డిమాండ్ చేశారు. వాంకిడి మండలం తేజాపూర్‌తో పాటు మరింత మంది మహిళలతో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 15 మండలాల నుంచి అనేకమంది మహిళలు ప్రతిరోజు కలెక్టర్ కార్యాలయం వద్ద తమకు ప్రభుత్వం ప్రకటించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని దరఖాస్తులు చేస్తున్నారని వారందరికీ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ఇంటి స్థలం ఉన్నవారికి రూ.మూడు లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినదని ఆ మొత్తాన్ని అర్హులైన వారికి అందజేయాలన్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో లబ్దిదారులకు అండగా పోరాటం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అదే కమలబాయి, శోభ, చిన్నబాయి, తానుభాయ్, శాంతాబాయి, మమత, సండే నిర్మల, బెండరీ కమల కాంత, సండే సావిత్రిబాయి, నిర్మల, సండే సుగుణ, వసంత, ఇంద్రభాయ్, సుమిత్ర, లక్ష్మి, శాంతాబాయి, మంజుల, పద్మ పాల్గొన్నారు.

జాప్యం జర్గకుండా చర్యలు తీసుకుంటాం

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

నవతెలంగాణ-కాసిపేట

వడ్ల కొనుగోలు కేంద్రాల్లో తుకం చేసిన వరి ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో జాప్యం జర్గకుండా చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు చర్యలు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ మధుఘాధన్ నాయక్ అధికారులకు ఆదేశించారు. గురువారం గోదాంకు సంబంధించిన లారీలు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు లారీల కోసం సోమగూడెం చౌరస్తాలో రహదారిపై తహసీల్దార్ దిలీప్ కుమార్‌తో కలిసి అడిషనల్ కలెక్టర్ రహదారిపై నిల్చొని ప్రైవేటు వాహనాలను సర్దుబాటు చేసి కొనుగోలు కేంద్రంకు పంపి వరి ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌పోర్టు అధికారులు లారీలను అవసరమైన మేరకు సమకూర్చే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వెహికల్ ఇన్స్‌పెక్టర్ ప్రత్యూష పాల్గొన్నారు.

వీఓఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

- రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకన్న

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత 39 రోజులుగా డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న వీఓఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకన్న డిమాండ్ చేశారు. సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏలను వెంటనే సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రస్తుతం ఉన్న ధరలకు అనుగుణంగా వారి వేతనాన్ని 26 వేలకు పెంచాలన్నారు. ఆరోగ్య భీమా రూ.10 లక్షలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. గత 39 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణం అన్నారు. వీఓఏలకు తమ మద్దతు పూర్తిగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, జిల్లా కార్యదర్శి రాజేందర్, ఐకేపీ వీఓఏ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సెల్వటిక బుద్దు, కీర్తి రమాదేవి, నాయకులు రేకల సుదర్శన్, వినోద్, గణేష్, శ్రీలత, శ్రీలక్ష్మి, పెరుగు శంకర్, ప్రమోద్, కల్పన, కవిత, లక్ష్మి, జ్యోతి, సంజు, రమేష్, సుధీర్, ప్రేమ, కళ్యాణి పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ధ్రువపత్రాల జారీ

తాండూర్ : నిబంధనల ప్రకారం కార్యనిర్వాహణ వ్యవహారాలు నిర్వహిస్తామని డిప్యూటీ తహసిల్దార్ మాధవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తుదారులు దళారులను నమ్మకుండా స్వయంగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుల మత రాజకీయ ఒత్తిళ్లకు, అవినీతికి తావివ్వకుండా తమ కార్యాలయ సిబ్బంది నిబంధన ప్రకారం పని చేస్తారని ఆమె తెలిపారు దరఖాస్తుదారులు కార్యాలయ పని వేళలో మాత్రమే సంప్రదించాలని ఆమె సూచించారు.